# సాక్షి పెద్దపల్లి

శనివారం । 20 । జనవరి । 2024




## స.హ.చట్టం సదస్సుకు హాజరు

మంథని: హైదరాబాద్‌లో చేపట్టిన సమాచార హక్కు చట్టం రాష్ట్రస్థాయి వర్క్‌షాపులో కార్యకర్త ఇనుముల సతీశ్ పాల్గొన్నారు.



## మీర్జంపేటలో కళాజాత

కాల్వశ్రీరాంపూర్: మీర్జంపేటలో జానపద కళాకారులు కళాజాత నిర్వహించారు. సంక్షేమ పథకాల గురించి వివరించారు.

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.4/20.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

పెద్దపల్లిరూరల్: పెండింగ్ ఓటరు దరఖాస్తులు పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర అధికారులు ఓటరు నమోదు, పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్లతో శుక్రవారం వీడియోకాన్ఫరెన్సు నిర్వహించి పలు సూచనలిచ్చారు. ఓటరు జాబితా ముసాయిదాపై అభ్యంతరాలను పరిష్కరించి ఫిబ్రవరి 8న తుది జాబితా రూపొందించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ అధికారులు సర్వసన్నద్ధంగా ఉండాలన్నారు. అసెంబ్లీ స్థానాల వారీగా పోలింగ్ కేంద్రాల జాబితా సిద్ధ చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు మధుమోహన్, హనుమా నాయక్, డెప్యూటీ తహసీల్దార్లు ప్రవీణ్, షఫీ, ఈశ్వర్, వజహత్‌అలీ, కిరణ్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### 24 వరకు బాలికా వారోత్సవాలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఈనెల 24వ తేదీ వరకు జాతీయ బాలికా వారోత్సవాలు నిర్వహిస్తామని జిల్లా సంక్షేమశాఖ అధికారి రవుఫ్‌ఖాన్ తెలిపారు. జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ద్వారా శుక్రవారం వారోత్సవాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. బాలికోన్నత పాఠశాలలు, గురుకుల విద్యాలయాలు, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల విద్యార్థినులకు ఈ సందర్భంగా వ్యాసరచన, క్రీడాపోటీలు, డ్రాయింగ్, స్పీచ్, పేరెంట్స్ మీటింగ్, భేటీ బచావో.. భేటీ పడావో తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. 24న కలెక్టరేట్‌లో ముగింపు కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేస్తారని పేర్కొన్నారు.

### 22న హాఫ్ డే సెలవు

జ్యోతినగర్(రామగుండం): అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం సందర్భంగా ఎన్టీపీసీలో ఈనెల 22న హాఫ్ డే సెలవు దినంగా ప్రకటిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. శుక్రవారం హెచ్‌ఆర్ విభాగం సీనియర్ మేనేజర్ హజారిక ఈ ఉత్తర్వులు జారీచేశారు. ఎన్టీపీసీకి చెందిన అన్ని ప్రాజెక్టులు, కార్యాలయాల్లో హాఫ్ డే సెలవుదినంగా ప్రకటించినట్లు వెల్లడించారు.

### నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల పోలింగ్ కేంద్రాల వద్ద ఈనెల 20, 21వ తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తామని ఆర్డీవో మధుమోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 జనవరి 1 నాటికి 18ఏళ్ల వయసు నిండి ఓటుహక్కు లేనివారంతా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శని, ఆదివారాల్లో ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరిస్తారని ఆయన పేర్కొన్నారు.

**రామగుండంలో..**

రామగుండం: రామగుండం నియోజకవర్గంలో శని, ఆదివారాల్లో నూతన ఓటర్ల నమోదుపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి అరుణశ్రీ తెలిపారు.

**మంథనిలో..**

మంథని: నియోజకవర్గంలోని 288 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు చేపడతామని ఆర్డీవో హనుమా నాయక్ తెలిపారు.

### నేటితో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ గడువు

పెద్దపల్లిరూరల్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్ 1, 2, 3, 4లో ఉచిత శిక్షణ అవసరమైన వారు ఈనెల 20లోగా(శనివారం)దరఖాస్తు చేసుకోవాలని కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 0878–2268686 ఫోన్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

### సింగరేణి ఉద్యోగులకు ప్రాక్టికల్ పరీక్షలు



పరీక్షకు హాజరైన ఉద్యోగులు

గోదావరిఖని: ఏరియా వర్క్‌షాప్‌లో ప్రాక్టికల్ పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. టిండాల్ సూపర్‌వైజర్(అండర్ గ్రౌండ్), టిండాల్(అండర్ గ్రౌండ్), టిండాల్(సర్ఫేజ్), రోప్ స్ప్లైసర్, కార్పెంటర్ పదోన్నతుల కోసం కంపెనీ ఉద్యోగులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. కమిటీ అధికారులు రామ్మోహన్, లక్ష్మీనారాయణ, రామ్మూర్తి పర్యవేక్షించారు. పరీక్షలకు 13మంది ఉద్యోగులు హాజరైనట్లు ఎస్‌వోటూ జీఎం తెలిపారు. కార్యక్రమంలో ఏరియా వర్క్‌షాప్ డీజీఎం జితేందర్‌సింగ్, డీవైఎస్‌ఈ రాజ్‌కుమార్, డీవైపీఎం నరేశ్‌చక్రవర్తి, సీనియర్ అసిస్టెంట్ అన్వేశ్, అధికారులు పాల్గొన్నారు.

# పల్లెకు ప్రగతి బాటలు!

- నిధుల కేటాయింపులపైనే అనుమానాలు
- ఏటా గ్రామాల వారీగా అభివృద్ధికి ప్రణాళికలు
- తొమ్మిది అంశాలపై శాఖల వారీగా రూపకల్పన
- జిల్లాలో కొనసాగుతున్న జీపీడీపీ సమావేశాలు
- నెలాఖరులోగా ముగియనున్న పంచాయతీ పాలకవర్గాల గడువు



హన్మంతునిపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం

పెద్దపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం పల్లెలను పట్టణాలకు ధీటుగా అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తోంది. 2030 నాటికల్లా ఉన్నతంగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా గ్రామపంచాయతీ డెవలప్‌మెంట్ ప్లానింగ్(జీపీడీపీ) సమావేశాలను జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తోంది. కేంద్రప్రభుత్వం వివిధ పద్దుల కింద గ్రామ పంచాయతీలకు అందించే నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేయకుండా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇందుకు అనుగుణంగా.. అదికూడా ఆన్‌లైన్‌లో చెల్లించేలా పనులు చేపట్టాలని ఆదేశించింది. కేంద్రప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో చేపట్టిన జీపీడీపీ సమావేశాలను ఈనెలాఖరుకల్లా పూర్తిచేసి ప్రణాళికలను సిద్ధం చేసేందుకు అధికారులు సన్నద్ధులవుతున్నారు.

**గ్రామ అవసరాలకనుగుణంగా..**

- గ్రామంలో స్థానికుల అవసరాలకు అనుగుణంగా, శాశ్వతంగా ప్రతిపదికన పనులు ఎంపిక చేయాల్సి ఉంటుంది.
- అందులో కేంద్రప్రభుత్వం నిర్దేశించిన 9 అంశాలకు అనుగుణంగా ఆయా శాఖల పనులను కూడా ఇందులో చేర్చాల్సి ఉంటుంది.
- ఏటా గ్రామ పంచాయతీల వారీగా ప్రణాళికలు సిద్ధం చేసి మంచి ఫలితాలు సాధించి అగ్రభాగంలో నిలిచిన సర్పంచ్, కార్యదర్శులకు కేంద్రప్రభుత్వం అవార్డులు అందించి ప్రోత్సహిస్తోంది.
- ఇందులో భాగంగానే గతేడాది జిల్లాలోని ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామపంచాయతీ పారిశుధ్యం మెరుగుపర్చడంలో అగ్రభాగాన నిలిచి అవార్డు అందుకుంది.

**నేడు కలెక్టరేట్‌లో సమావేశం..**

- ఈనెలాఖరుకల్లా జీపీడీపీ సమావేశాలు అన్నీ పూర్తిచేయాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు.
- అయితే, ఈ సమావేశాలు ఇప్పుడిప్పుడే ప్రారంభం కావడంతో ఈనెలాఖరుకల్లా పూర్తికావాలంటే వేగం పెంచేలా కార్యదర్శులను సమాయత్తం చేసేందుకు శనివారం జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓవలు, ఎంపీవోలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ పాల్గొని దిశానిర్దేశం చేయనున్నారు.

**కేంద్రప్రభుత్వ నిధులతోనే..**

గ్రామ పంచాయతీలు శాఖల వారీగా ప్రణాళికలు రూపొందించే పనులకు కేంద్రప్రభుత్వం వివిధ పద్దుల కింద అందించే నిధులతోనే ప్రగతి పనులు చేయాల్సి ఉంటుంది. ఈ పనుల వ్యవహారాలు అన్నీఆన్‌లైన్ పద్ధతిలోనే నిర్వహించాల్సి ఉంటుందని అధికారవర్గాలు తెలిపాయి. గ్రామ పంచాయతీకి అవసరమైన సామగ్రి కొనుగోలు చేయాలన్నా.. ఈ మార్కెట్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేస్తే వ్యాపారులు తమ ధరలను ప్రకటిస్తారని పేర్కొన్నారు. ఎవరు తక్కువ ధర కోట్‌చేస్తే వారి నుంచే సామగ్రి కొనుగోలు చేసి ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేయాల్సి ఉంటుందని వివరించారు. పంచాయతీల నిధులు పక్కదారి పట్టకుండా చూడడంతోపాటు ప్రజలు తమకు అవసరమైన పనులకే ప్రాధాన్యమిచ్చుకుని గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడమే ఈ జీపీడీపీ ప్రధాన ఉద్దేశమని పేర్కొంటున్నారు.

> **విజన్- 2030 లక్ష్యం**
>
> 
>
> పల్లెలను పట్టణాలకు ధీటుగా తీర్చిదిద్దేలా కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు వీలుగా స్థానిక అధికారుల సాయంతో దృష్టి సారించింది. 2030 నాటికల్లా అన్ని విధాలా గ్రామం సంపూర్ణ అభివృద్ధి సాధించేలా ప్రణాళికలు దోహదపడతాయి.
>
> – చంద్రమౌళి, డీపీవో

# తొలిమెట్టుతో సత్ఫలితాలు



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, డీఈవో

- టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి
- ఈనెలాఖరు వరకు విద్యార్థులకు కౌన్సెలింగ్
- హెచ్‌ఎంలతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే మెరుగైన విద్యా ప్రమాణాలు అందేలా రూపొందించిన తొలిమెట్టు కార్యక్రమం మంచి ఫలితాలు ఇనిస్తోందని, ఉపాధ్యాయులు అంకితభావంతో విద్యాబోధన చేస్తూ, మరిన్ని మెరుగైన ప్రమాణాలు సాధించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం తొలిమెట్టు, ఉన్నతి, టెన్త్ పరీక్షల్లో మంచి ఫలితాల సాధనపై ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులు వక్రమార్గాల వైపు వెళ్లకుండా ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. గ్రామస్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తూ ఆటలపై విద్యార్థులకు ఆసక్తి పెంచాలని పేర్కొన్నారు. విజ్ఞానం పెంపొందించేందుకు వీలుగా ఎన్టీపీసీ, నీటిపారుదల ప్రాజెక్టులకు విజ్ఞాన పర్యటనలు ఏర్పాటు చేస్తూ చిన్నారుల్లో ఆసక్తి పెంచాలని చెప్పారు.

**ఆదర్శ పాఠశాలల్లో సమగ్రాభివృద్ధి**

జిల్లాలో ఎంపిక చేసిన ఐదు ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం పకడ్బందీగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్, కిటికీలకు మెష్, ఫ్యాన్, లైట్లు, నీటి వసతి తదితర సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అన్ని పాఠశాలల్లో బాలికలకు తప్పనిసరిగా టాయిలెట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**టెన్త్ నూరుశాతం ఫలితాలు**

జిల్లాలో టెన్త్ పరీక్షలకు హాజరయ్యేవారంతా మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా ప్రత్యేక బోధన చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. పరీక్షలు పూర్తి అయ్యేదాక విద్యార్థుల ఏకాగ్రత చదువుపైనే ఉండేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈనెలాఖరు దాకా కౌన్సెలింగ్ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో డీఈవో మాధవి, ప్రధానోపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## 'మిషన్' గన్నుతో..



కాలం మారుతోంది. ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వస్తోంది. కులవృత్తులు ఆధునికత సంతరించుకుంటున్నాయి. శ్రామికులపై పనిభారం తగ్గుతోంది. ఒకప్పుడు(ఇప్పటికీ కొందరు) ఇనుమును నిప్పు కణికల్లో ఎర్రగా కాల్చి తమకు అవసరమైన ఆకారంలో మలుచుకునేందుకు గన్నుతో బలంగా బాదేవాళ్లు. వ్యవసాయం నుంచి మొదలు.. భారీ వాహనాల వరకూ అవసరమైన పరికరాలను ఇలా తయారు చేసేవారు. సంచారజాతుల వారు ఇప్పటికీ గన్నుతో బాదుతూ అవసరమైన ఆకృతిలో తయారు చేస్తున్నారు. కానీ, పెద్దకల్వలలోని ఓ వ్యక్తి ఆధునిక యంత్రంపై వ్యవసాయ పనిముట్లు సులభంగా సానపడుతూ 'సాక్షి' కెమెరాకు కనిపించాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

# రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



ముప్పిరితోటలో మహిళా సంఘ భవనం ప్రారంభిస్తున్న విజయరమణారావు, భానుప్రసాద్‌రావు

- ఎమ్మెల్యే విజయరమణారావు, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు

ఎలిగేడు(పెద్దపల్లి): రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే విజయరమణారావు, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు అన్నారు. ముప్పిరితోటలోని కమ్యూనిటీహాల్, సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. మహిళా కమ్యూనిటీ భవనం ప్రారంభించారు. లోకపేట వాల్మీకిబోయ కమ్యూనిటీ భవనం పనులకు శంకుస్థాపన చేశారు. భానుప్రసాదరావు మాట్లాడుతూ, ఈసారైనా విజయరమణారావుకు మంత్రి పదవి వస్తుందని ఆశించామని, రాలేదని, అయినా, నిరాశ పడకుండా ఇద్దరం సమన్వయంతో అభివృద్ధి చేస్తామన్నారు. విజయరమణారావు మాట్లాడుతూ లోకపేట, ముప్పిరితోటలో వచ్చే ఐదేళ్లలో సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, సర్పంచులు పెద్దోళ్ల ఐలయ్య, దేవరనేని ప్రభావతి, వెంకటేశ్వర్‌రావు, ఉపసర్పంచులు చీకటి శైలజ, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు మందల సత్యనారాయణరెడ్డి, దుగ్యాల సంతోష్‌రావు, బాలుసాని పరుశరాములుగౌడ్, భూర్ల వెంకటసత్యం, వేణుమాధవరావు, కొండ తిరుపతిగౌడ్, తానిపర్తి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం**

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ప్రజాసమస్యల పరిష్కారమే ప్రజాప్రతినిధుల కర్తవ్యమని ఎమ్మెల్యే విజయరమణారావు, ఎమ్మెల్సీ భానప్రసాద్‌రావు అన్నారు. ఆరెపల్లె కొత్త గ్రామపంచాయతీ భవనం, పెగడపల్లి జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన గదిని శుక్రవారం వారు ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారం చేపట్టి కేవలం 40 రోజులే గడిచిందని, అయినా, నియోజకవర్గ సమస్యలపై తనకు అవగాహన ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందిస్తానన్నారు. కాగా, 317 జీవోను రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కృష్ణమూర్తి, సత్యనారాయణరావు ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## అతివేగం మరణానికి కారణం



మాట్లాడుతున్న ఎంవీఐ భీమ్‌సింగ్

జ్యోతినగర్(రామగుండం): అతివేగం మరణానికి కారణమని రామగుండం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) భీమ్‌సంగ్ అన్నారు. శుక్రవారం ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డులో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా రాజీవ్ రహదారిపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రమాదాల నివారణ కోసం హెచ్‌కేఆర్ అధికారులకు పలు సూచనలను చేశారు. వాహనదారులకు రోడ్డు సేఫ్టీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌కేఆర్ అధికారులు నవీన్, రాము, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఫరూక్, ట్రాఫిక్ కానిస్టేబల్ సోము కుమార్, ఎంవీఐ కార్యాలయ సిబ్బంది నజీరొద్దీన్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

# అవిశ్వాస తీర్మానంపై రహస్య మంతనాలు

- నేడు హైదరాబాద్‌కు రామగుండం కార్పొరేషన్ కార్పొరేటర్లు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే విషయంలో తగ్గేదే లేదంటున్నారు కొందరు అసంతృప్తితో ఉన్న సొంతపార్టీకి చెందిన కార్పొరేటర్లు. శుక్రవారం గోదావరిఖని గంగానగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు రహస్యంగా ఇదే విషయంపై సుదీర్ఘంగా మంతనాలు జరిపారని తెలిసింది. హైదరాబాద్‌లో మరోసారి భేటీ అయ్యేందుకు శనివారం తరలివెళ్లాలనే నిర్ణయానికి కార్పొరేటర్లు వచ్చినట్లు సమాచారం. అవిశ్వాస తీర్మానం నోటీసుపై అంగీకారం తెలిపిన కొందరు కార్పొరేటర్లు.. శుక్రవారం జరిపిన మంతనాల్లో సంతకాలు చేశారని తెలిసింది. శనివారం నుంచి సోమవారం వరకు కార్పొరేటర్లు క్యాంప్‌లోనే ఉండి చర్చలు జరుపుకోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఏకాభిప్రాయానికి వచ్చిన అందరితో నోటీసుపై సంతకాలు చేసి, నేరుగా కలెక్టర్ కార్యాలయానికి రావాలని ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది. అవిశ్వాసం సెగ సమసిపోయిందనుకున్న తరుణంలో.. మళ్లీ సొంత పార్టీ కార్పొరేటర్లు రహస్యంగా భేటీ అవుతుండడం బల్దియాలో చర్చనీయాంశంగా మారింది.

# టీబీజీకేఎస్ పయనమెటు?

- 'గుర్తింపు' ఎన్నికల్లో చేతులెత్తేసిన అధిష్టానం
- ముగ్గురు ముఖ్య నేతల రాజీనామాతో అయోమయం
- యూనియన్ శ్రేణులు, నాయకుల్లో తొలగని నిరుత్సాహం

గోదావరిఖని: జాతీయ కార్మిక సంఘాలకు ధీటుగా ఎదిగిన తెలంగాణ బొగ్గు గని కార్మిక (టీబీజీకేఎస్–బీఆర్‌ఎస్ అనుబంధ) సంఘం భవిష్యత్‌పై కార్మికుల్లో అయోమయం నెలకొంది. సరిగ్గా గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు ముందే యూనియన్ అధ్యక్షుడు వెంకట్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి రాజీనామా.. చక్క దిద్దాల్సిన కేసీఆర్.. పార్టీ పెద్దగా దృష్టి సారించకపోవడం యూనియన్ శ్రేణులను అయోమయానికి గురిచేసింది. అధిష్టానం పోటీ వద్దనే సంకేతం ఇచ్చినా.. అప్పటికే నామినేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో పోటీ అనివార్యమైంది. యూనియన్ గౌరవ అధ్యక్షురాలు సైతం ప్రచారానికి దూరంగా ఉండటంతో యూనియన్ చతికిల పడిపోయింది. అన్నిఏరియాల్లో బలమైన కమిటీలు, పూర్తిస్థాయి ముఖ్యనేతలు, కార్యకర్తలు ఉన్నా.. పార్టీ అధిష్టానం తీరుతో ఒక్కసారిగా యూనియన్ శ్రేణులు విస్తుపోయారు. తొమ్మిదేళ్లపాటు ఏ కఛత్రాధిపత్యం సాగించిన టీబీజీకేఎస్.. కోలిండియాలోలేని అనేక హక్కులు సాధించి కార్మికుల్లో ప్రత్యేక గుర్తింపు పొందింది.

**అసెంబ్లీ స్థానాల ఓటమితోనే ఆగ్రహం..**

- సింగరేణి విస్తరించిన ఆరు జిల్లాల్లోని అసెంబ్లీ స్థానాల్లో ఒక్కటి తప్ప మిగితావన్నీ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది.
- కారుణ్య నియామకాలతోపాటు కోలిండియాలో లేనిఅనేక హక్కులను సాధించి గుర్తింపు యూనియన్‌గా ఉండగా పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు ఓటమి పాలవడంతో పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం.
- అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే గుర్తింపు యూనియన్ ఎన్నికల నగారా మోగడంతో అధిష్టానం పూర్తిస్థాయిలో మేధోమథనం చేసి ఎన్నికలకు దూరంగా ఉండటమే ఉత్తమని భావించినట్లు ప్రచారం జరుగుతోంది.
- ఈక్రమంలో ఎన్నికల విధివిధానాలపై అక్కడకు వెళ్లిన యూనియన్ నాయకుల తీరుపై కూడా ముఖ్య నేతలు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.
- ఇదే క్రమంలో ఒకేపత్రంపై ముగ్గురు పేర్లతో రాజీనామా సమర్పించినట్లు విస్తృతంగా ప్రచారం జరుగుతోంది.



గోదావరిఖనిలోని టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయం

**అన్ని చేసినా వ్యతిరేకత ఎందుకు..?**

సుమారు తొమ్మిదేళ్లకుపైగా గుర్తింపు యూనియన్‌గా కార్మికులకు కోలిండియాలో లేనిఅనేక హక్కులు సాధించినా.. పార్టీపై ఎందుకు వ్యతిరేకత వచ్చిందనే దానిపై అధిష్టానం పూర్తి సమాచారం తెప్పించుకున్నట్లు సమాచారం. కార్మికుల పిల్లలకు ఉద్యోగాలిచ్చే కారుణ్య నియామకాల విషయంలో చేతివాటం, పదోన్నతులు, క్వార్టర్ల కేటాయింపు, బదిలీల విషయంలో నాయకులు వ్యవహరించిన తీరుపైనే కార్మికుల్లో వ్యతిరేకత పెరిగినట్లుగా తెలుస్తోంది. ఈప్రభావం అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల ఓటమికి దారి తీసినట్లుగా ప్రచారం జరుగుతోంది.

**యూనియన్ భవిష్యత్ ఏమిటి?**

- తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం భవిష్యత్ కార్యకలాపాలపై కార్మికుల్లో ఆసక్తి నెలకొంది.
- గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు ముగిసి సుమారు 20రోజులు గడిచింది.
- బీఆర్‌ఎస్ అధిష్టానం యూనియన్ భవిష్యత్‌పై ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.
- మొన్నటి గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీబీజీఎస్ 1,298 ఓట్లు సాధించింది.
- నాయకులు ప్రచారం చేయకున్నా, ముఖ్యనేతలు రాజీనామా చేసినా టీబీజీకేఎస్‌కు ఓట్లు వచ్చాయి.
- ఆత్మప్రబోధం ప్రకారం ఓటు వేయాలని యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునివ్వడంతో ఓటు బ్యాంక్ పెరిగినట్లుగా భావిస్తున్నారు.

**కొత్త నాయకత్వమా.. పాత వారికే అవకాశమా?**

భవిష్యత్‌లో యూనియన్‌ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తారనే ప్రచారం సాగుతోంది. ముఖ్యనాయకులు రాజీనామా చేసినా వారితో తిరిగి అధిష్టానం మాట్లాడక పోవడాన్ని చూస్తే రాబోయే రోజుల్లో కొత్తవారికే అవకాశం ఇస్తారనే ప్రచారమూ ఉంది. ఎన్నికల ముందే నూతనంగా ఉద్యోగంలో చేరిన యువతతో ప్రత్యేక కమిటీలు వేస్తారనే ప్రచారం సాగినా.. అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అన్ని ఏరియాల్లో యూనియన్ కార్యాలయాలు, అన్ని హంగులు ఉన్న యూనియన్ తీరుపై అధిష్టానం తీసుకునే నిర్ణయం ఎలా ఉంటుందనే చర్చ సింగరేణి బొగ్గు గనులపై సాగుతోంది.

**గుర్తింపు ఎన్నికల్లో సాధించిన ఓట్లు**

| ఏరియా | ఓట్లు |
|---|---|
| ఆర్జీ–1 | 37 |
| ఆర్జీ–2 | 47 |
| ఆర్జీ–3 | 59 |
| భూపాల్‌పల్లి | 57 |
| బెల్లంపల్లి | 03 |
| మందమర్రి | 81 |
| శ్రీరాంపూర్ | 216 |
| మణుగూరు | 728 |
| ఇల్లెందు | 01 |
| కొత్తగూడెం | 36 |
| కార్పొరేట్ | 33 |

## క్లుప్తంగా

### చెట్టును ఢీకొట్టిన కారు



ప్రమాదానికి గురైన కారు

**జ్యోతినగర్(రామగుండం):** ఎన్టీపీసీ టౌన్‌షిప్ బి–గేట్ సమీపంలోని రాజీవ్ రహదారిపై ఓ కారు చెట్టును ఢీకొంది. శుక్రవారం సాయంత్రం గోదావరిఖని నుంచి రామగుండం వైపు వస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు మధ్యలోని చెట్టును ఢీకొని గోదావరిఖని వైపు వెళ్లే రోడ్డుపైకి వచ్చి చేరింది. ప్రమాద సమయంలో వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కారు నడిపే వ్యక్తికి ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో భయంతో కారు వదిలి పారిపోయాడు. ఎన్టీపీసీ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు రోడ్డు పక్కన ఉన్న కారును తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

### విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

**ఓదెల(పెద్దపల్లి):** పొత్కపల్లి ట్రాన్స్‌కో ఏఈఈ రాజమల్లుపై దౌర్జన్యం చేసి, విధులకు ఆటంకం కలిగించిన ఇందుర్తి గ్రామానికి చెందిన కంకణాల పవన్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పొత్కపల్లి ఎస్సై నూతి శ్రీధర్ శుక్రవారం తెలిపారు. విధులకు ఆటంకం కలిగించడంతోపాటు దౌర్జన్యం చేశాడనే ఏఈఈ రాజమల్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

### చీటింగ్ చేసిన వ్యక్తిపై..

**జ్యోతినగర్(రామగుండం):** ఓ వ్యక్తికి ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.4 లక్షలు తీసుకున్నట్లు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్ శుక్రవారం తెలిపారు. ఎన్టీపీసీ కృష్ణానగర్ ప్రాంతానికి చెందిన బూస ప్రదీప్ కుమార్ ప్రభుత్వ గురుకుల ఉద్యోగం కోసం గోదావరిఖని ప్రాంతానికి చెందిన కోట శ్రీనివాస్‌కు రూ.4 లక్షలు చెల్లించాడు. అయితే శ్రీనివాస్.. ఆ వ్యక్తికి ఉద్యోగం ఇప్పించలేదు. దీంతో బాధితుడు తన డబ్బు తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశాడు. అందుకు డబ్బులు చెల్లించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

### యువకుడి ఆత్మహత్య

**జమ్మికుంట(హుజూరాబాద్):** శాలవాడకు చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. దిడ్డి రాజేశ్(22) తండ్రి కృష్ణ, తల్లి వసంత కుటుంబ కలహాలతో వేరుగా ఉంటున్నారు. తల్లితో కొడుకు రాజేశ్, కూతురు సంధ్య ఉంటున్నారు. కుమారుడు తరచూ తల్లిని బెదిరిస్తూ.. డబ్బులు ఇవ్వాలని, వేధించేవాడు. గత సోమవారం తల్లి, చెల్లిని ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. శుక్రవారం నల్లా నీరు వస్తోందని కృష్ణ కుమారుడి కోసం చూశాడు. చుట్టుపక్కల వారిని సంప్రదించగా సోమవారం నుంచి కనిపించడం లేదని తెలిసింది. అనుమానం వచ్చి, ఇంటికి వెళ్లి, తలుపులు తీసి చూడగా రాజేశ్ ఉరేసుకొని కనిపించాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



# బస్టాండ్ విస్తరణపై ఆశలు

- పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్య
- అభివృద్ధికి నోచుకోని ప్రయాణ ప్రాంగణం
- సర్కారు స్పందించాలని ప్రయాణికుల విన్నపం



రాజీవ్‌రోడ్డు వైపు మూసిన ప్రవేశద్వారం



పెద్దపల్లి బస్టాండ్

**పెద్దపల్లిరూరల్:** జిల్లా కేంద్రమైన పెద్దపల్లి ఆర్టీసీ బస్టాండ్ విస్తరణకు నోచడం లేదు. దాదాపు మూడున్నర దశాబ్దాల కాలం క్రితం అప్పటి అవసరాలకు అనుగుణంగా ఆరు ప్లాట్‌ఫామ్‌లతో నిర్మించిన బస్టాండ్.. నేటికీ ఆధునికీకరణకు నోచుకోలేదు. జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు గోనె ప్రకాశ్‌రావు, సోమారపు సత్యనారాయణ ఆర్టీసీ చైర్మన్‌లుగా వ్యవహరించినా పరిస్థితిలో మార్పు రాలేదు. ప్రతీరోజు గోదావరిఖని, కరీంనగర్, జగిత్యాల, మంథని, మంచిర్యాల, ఆసిఫాబాద్ తదితర డిపోలకు చెందిన సుమారు 300కుపైగా బస్సులు నడుస్తుంటాయి. దాదాపు 3వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి.

**సమస్యల రద్దీ...!**

- బస్టాండ్‌కు అతిసమీపంలోనే రైల్వేస్టేషన్ ఉంది.
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అత్యధికంగా ప్రయాణికులు ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తారు.
- బస్టాండ్ ఇరుకుగా ఉండడంతోపాటు కూర్చునేందుకు బెంచీలు సరిపోవడంలేదు.
- ప్రయాణికుల దాహం తీర్చేందుకు తాగునీటి సౌకర్యం లేదు.

**ప్రతీ అర్ధగంటకో బస్సు..**

పెద్దపల్లి నుంచి ధర్మారం, జగిత్యాల, పెద్దపల్లి నుంచి సబ్బితం–యైటింక్లయిన్‌కాలనీ వరకు ప్రతీ అర్ధగంటకో బస్సు నడుపుతున్నారు. ఆయా రూట్లలో ఇలా 29 ట్రిప్పులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ మార్గంలో ప్రయాణించే వారికి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించిన అధికారులు.. రద్దీకి అనుగుణంగా పెద్దపల్లి నుంచి ఓదెల, జూలపల్లి, ఎలిగేడు రూట్లలో ట్రిప్పుల సంఖ్య పెంచడం లేదు.

**ప్రైవేట్ వాహనాల హవా..**

- బస్టాండ్ ఆవరణలోకి ప్రైవేట్ వ్యక్తులు, కార్లు, బైకులతో యథేచ్ఛగా వస్తూ స్వైర విహారం చేస్తున్నారు.
- తద్వారా తరచయూ ప్రమాదాలు జరుగుతున్నాయి.
- దీంతో రాజీవ్‌రోడ్డు వైపు ఉన్న ప్రవేశద్వారం మూసివేయాల్సి వచ్చింది.
- ఒకే ద్వారం నుంచి బస్సుల రాకపోకలు సాగేలా ఏర్పాట్లు చేయడంతో బస్సులను తిప్పడం డ్రైవర్లకు ఇబ్బందిగా మారింది.
- అయినా ప్రైవేట్ వ్యక్తులు తమ వాహనాలతో వచ్చి ఇబ్బంది పెడుతున్నారు.
- ఇలాంటివారితో ఆర్టీసీ అధికారులు వాగ్వాదానికి దిగాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి.

### ప్రతిపాదించాం



పెద్దపల్లి బస్టాండ్ ఆధునికీరణకు ప్రతిపాదనలు రూపొందించాం. ఆవరణలో సిమెంట్ రోడ్డు నిర్మిస్తాం. ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రైవేట్ వాహనాల నియంత్రణకు రాజీవ్ రహదారివైపు ప్రవేశ ద్వారం శాశ్వతంగా మూసివేస్తాం.

– రాంగోపాల్‌రెడ్డి, స్టేషన్ మేనేజర్, పెద్దపల్లి

### బస్సుల సంఖ్య పెంచాలి



ఊళ్లకు రోడ్డు సౌకర్యం మెరుగుపడింది. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలి. పెద్దపల్లిలో బస్‌డిపో ఏర్పాటు చేస్తేనే మరిన్ని బస్సులు అందుబాటులోకి వస్తాయి. ప్రయాణికులకు సౌకర్యం కలుగుతుంది.

– గోదాదేవీ, ధూళికట్ట

### బస్టాండ్‌పై పట్టింపేది?



చాలా కాలం క్రితం నిర్మించిన బస్టాండ్‌ను ప్రస్తుత ప్రయాణికుల సంఖ్య, వారి అవసరాలకు అనుగుణంగా విస్తరించాలి. ఆర్టీసీ అధికారులు, పాలకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. బస్టాండ్ విస్తరించడంతోపాటు ఆధునికీకరించాలి.

– కల్వల రాజేశం, పెద్దకల్వల

### ఆవరణ శుభ్రం చేయాలి



బస్టాండ్ ఆవరణను శుభ్రం చేసి, గుంతలు ఏర్పడకుండా సిమెంట్ రోడ్డు వేయాలి. పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు తొలగించాలి. రాజీవ్ రోడ్డు వైపు మాదిరిగా రైల్వేస్టేషన్‌రోడ్డులో షాపింగ్ కాంప్లెక్సు నిర్మిస్తే ఆదాయం సమకూరుతుంది.

– సమత, సుందిళ్ల

## కాంట్రాక్టు కార్మికుల హక్కులు సాధిస్తాం

- ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు ఐ.కృష్ణ



మాట్లాడుతున్న కృష్ణ

**గోదావరిఖని:** ఆర్‌ఎఫ్‌సీఎల్‌లోని కాంట్రాక్టు కార్మికుల చట్టబద్ధ హక్కులు, సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు ఐ.కృష్ణ అన్నారు. శుక్రవారం ఆర్‌ఎఫ్‌సీఎల్ బ్రాంచ్ కమిటీ సమావేశం స్థానిక యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. ఎరువుల కర్మాగారంలో మూడేళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు, చట్టబద్ధ హక్కులు అమలు కావడం లేదని విమర్శించారు. ఈవిషయంలో ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యాన్ని కలిసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. గతేడాది జూలైలో 20రోజుల పాటు జరిగిన సమ్మె సందర్భంగా చేసుకున్న వేతన ఒప్పందాన్ని కూడా కాంట్రాక్టర్ అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ ఎంప్లాయ్‌గా ఉన్న ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం కాంట్రాక్టర్‌కు వత్తాసు పలుకుతూ కార్మికుల సమస్యల్ని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు నరేశ్, ఐత శ్రావణ్, తిప్పని రాంకీ, పయ్యావుల శ్రీకాంత్, మర్రి శ్రావణ్, శివకుమార్, బైరి రాకేశ్, ఆకుల రమేశ్, నల్గొండ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

**కార్మిక శాఖ కార్యాలయంలో వినతిపత్రం**

**జ్యోతినగర్(రామగుండం):** ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో పనిచేస్తున్న కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని, చట్టబద్ధ హక్కులు కల్పించాలని కోరతూ ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి నరేశ్ ఎన్టీపీసీ టెంపరరీ టౌన్‌షిప్‌లోని కేంద్ర కార్మిక శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

# నిరుపయోగ భూములపై నజర్



వరి నారు సిద్ధం చేసుకుంటున్న రైతులు

- సాగుచేసుకుంటున్న నిర్వాసిత రైతులు
- అభ్యంతరం వ్యక్తం చేసిన సింగరేణి యాజమాన్యం

**రామగుండం:** రామగుండం కార్పొరేషన్ పరిధి అక్కడి నుంచే ప్రారంభవుతుంది. అయినా, నియోజకవర్గంలో చివరి గ్రామం. ఆ ఊరుకు వెళ్లేందుకు ఒకేరహదారి. ఇంకా కొంతముందుకు నేరుగా వెళ్తే గోదావరి నది వస్తుంది. అదే మేడిపల్లి–లింగాపూర్ ఓపెన్‌కాస్టు నిర్వాసిత పాములపేట. పాములపేటలో నిర్వాసిత కుటుంబాలే ఉన్నాయి. పూర్తిగా వ్యవసాయాధారితం. మేడిపల్లి ఓపెన్‌కాస్టు కోసం పాములపేట, ఆబాది రామగుండం, లింగాపూర్‌లోని సుమారు వెయ్యి ఎకరాలను సింగరేణి 1994లో సేకరించింది. అప్పటి ధర ప్రకారం నిర్వాసిత రైతులకు పరిహారం చెల్లించింది. ఇందులో పాములపేటకు చెందిన 60 ఎకరాలు ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు.

**ముగిసిన జీవితకాలం..**

- రెండేళ్లక్రితం ఓపెన్‌కాస్టు జీవితకాలం ముగిసింది.
- బొగ్గు తవ్వకాలు నిలిచిపోయాయి.
- ఆ భూముల పరిరక్షణకు సింగరేణి ఇనుప కంచె వేస్తోంది.
- అయితే, పాములపేటలోని నిర్వాసిత కుటుంబాలు ఆ భూముల్లో వివిధ పంటలు వేయగా.. సింగరేణి యాజమాన్యం అభ్యంతరం తెలిపింది.
- ఈ విషయమై బాధితులు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్‌కు మొరపెట్టుకున్నారు.
- స్పందించిన ఎమ్మెల్యే.. నిర్వాసిత రైతుల ప్రయోజనాలు కాపాడడం కోసం క్షేత్రస్థాయిలో పర్యటించారు.
- నిరుపయోగంగా ఉండి, సాగుకు యోగ్యమైన భూములు గుర్తించారు.
- ఇటీవల బ్లేడ్ ట్రాక్టర్ సాయంతో ఇనుప కంచె తొలగించారు.
- దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తమైంది.
- సింగరేణి యాజమాన్యం నుంచి అడ్డంకులు రాకపోవడం, తానున్నానని ఎమ్మెల్యే భరోసా కల్పించడంతో సుమారు 50 ఎకరాలు సాగు దశలోకి వస్తాయని అంచనా వేస్తున్నారు.

### రైతులకే చట్టమా?



సింగరేణిలోని విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. వాటిని పరిరక్షించుకోలేని సంస్థ.. కనీసం రోడ్డు సౌకర్యంలేని మారుమూల పాములపేటలో దళిత నిర్వాసితులు సాగు చేసుకుంటుంటే అడ్డుకోవడం సరికాదు. రైతుల ప్రయోజనాలు కాపాడుకోవడమే నా కర్తవ్యం.

– ఎంఎస్ రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్యే

### కంచె వేస్తే నిరుపయోగం



30 ఏళ్ల క్రితం సింగరేణి భూసేకరణ చేసింది వాస్తవమే. కానీ ప్రస్తుతం సింగరేణి అవసరాలు తీరాయి. ఓపెన్‌కాస్టు జీవిత కాలం ముగిసింది. భూములు నిరుపయోగంగా మారాయి. వాటిని పరిరక్షించేందుకు కంచె వేయడంతో పిచ్చిమొక్కలతో నిండిపోతాయి. అందులో పంటలు పండిస్తే పచ్చదనంతో నిత్యం కళకళలాడుతాయి. మా జీవితాలు కూడా అలాగే ఉంటాయి. సింగరేణి మానవతా దృక్పథంతో ఆలోచించాలి.

– పల్లికొండ కొమురయ్య, రైతు

### శాశ్వతంగా వద్దు

బతికినన్ని రోజులు ఇంటి పట్టున ఉంటూ సింగరేణి భూమిలో సాగు చేసుకుంటే ఉపాధి కోసం ఎక్కడికో పోనవసరం లేదు. మా పక్కనున్న భూమిలో సాగు చేసుకోవాలనే ఉద్దేశంతో పంటలు వేస్తే సింగరేణి అడ్డుకుంది. ఇదే విషయాన్ని ఎమ్మెల్యేకు చెప్పినం. ఆయన రైతు పక్షపాతిగా స్పందించారు. ఆ భూములను శాశ్వతంగా మా పేరుపై పట్టా చేయాలని అడగడం లేదు.

– కుడుక మల్లయ్య, నిర్వాసిత రైతు

## కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా పోరాటం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు



మాట్లాడుతున్న ముత్యంరావు

**పెద్దపల్లిరూరల్:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా పోరాటాలు చేసేందుకు సన్నద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవల్లి ముత్యంరావు కోరారు. జిల్లా కేంద్రంలని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో నాయకులు బూడిద గణేశ్, రాసపల్లి తిరుపతితో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసేందుకే కేంద్రప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ఉన్న చట్టాలను కాలరాసేలా చట్టాలను సవరిస్తోందని ఆరోపించారు. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా వేతన సవరణ జరగాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజయ్య, రాజేందర్, వెంకటస్వామి, సతీశ్, రవి, సురేశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## నమ్మకంతోనే గెలిపించారు



మాట్లాడుతున్న సీతారామయ్య

**గోదావరిఖని:** కార్మికులు యూనియన్‌పై నమ్మకంతో గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా హక్కుల సాధనలో ముందుకు సాగాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శుక్రవారం స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో సింగరేణి ఎన్నికలపై కేంద్ర కార్యవర్గ సమావేశంలో సమీక్షించారు. ఈసందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఐఎన్‌టీయూసీ గెలుపు కోసం డబ్బులు, మద్యం, విలువైన కానుకలు పంచిపెట్టారని విమర్శించారు. ఏఐటీయూసీని ఓడించాలని ఎంతో ప్రయత్నించారని, అయినప్పటికీ కార్మికులు నమ్మకంతో గెలిపించారన్నారు. ఆయా ఏరియాల నాయకులు కార్మికుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా పనిచేయాలని అన్నారు. యూనియన్‌లో కొత్త వారికి అవకాశం కల్పిస్తూ యువతను ప్రోత్సహించాలని కోరారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాజ్‌కుమార్, నాయకులు మిరియాల రంగయ్య, సారయ్య, ఎల్.ప్రకాశ్, వెంకటస్వామి, వీరభద్రయ్య, వైవీ రావు, మడ్డి ఎల్లయ్య, ముస్కె సమ్మయ్య, ఏరియాల బ్రాంచి కార్యదర్శులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

- సంఘటన స్థలంలోనే రాత్రంతా మృతదేహం
- ఎల్లారెడ్డిపేటలో విషాదం



మృతి చెందిన కుమార్



కుమార్(ఫైల్)

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన పెంటం కుమార్(30) గురువారం రాత్రి బైక్ అదుపుతప్పి అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రి 11 గంటల సమయంలో ప్రమాదం జరిగితే తెల్లావారుజాము వరకు ఎవరూ చూడకపోవడంతో మృతదేహం అక్కడే పడి ఉంది. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేటలో విషాదం నింపింది. శుక్రవారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని కుమార్‌దిగా గుర్తించి బోరున విలపించారు. మృతునికి తండ్రి పద్మయ్య, సోదరుడు ప్రవీణ్, భార్య సోని, పిల్లలు చరణ్, వర్షిత్ ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

## ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అరెస్ట్



అరెస్ట్ చూపుతున్న పోలీసులు

**మెట్‌పల్లి:** నియోజకవర్గంలో పలు ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడ్డ ముగ్గురు యువకులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మెట్‌పల్లికి చెందిన షేక్ హైదర్, మోర్తాడ్‌కు చెందిన ఎర్ర వెంకటి, కొర్వ సంతోష్ సులభంగా డబ్బులు సంపాదించడానికి ఆలయాల్లో చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు కోరుట్ల, గోధూర్, జగ్గాసాగర్, ధర్మారం, రాంలచ్చక్కపేటల్లోని పలు ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. ముగ్గురిని ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ వద్ద అదుపులోకి తీసుకొని, రూ.9వేల నగదు, 14తులాల వెండి, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వారిని పట్టుకున్న కానిస్టేబుళ్లు కిరణ్, సంతోష్‌కు రివార్డు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

## వ్యక్తి బలవన్మరణం

**మేడిపల్లి:** కొండాపూర్‌లో ఉరివేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఏఎస్సై రవీందర్‌రావు వివరాల ప్రకారం.. గంగవేణి మహేశ్(45) గొర్రెల కాపరి. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో గొర్లు మేపడానికి సరిగా వెళ్లడం లేదు. మద్యం తాగడం మానేసి, గొర్లు మేపేందుకు వెళ్లాలని అతనికి భార్య లక్ష్మి మందలించింది. మనస్తాపం చెందిన మహేశ్ ఇంటి సమీపంలోని గొర్ల కొట్టం వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మహేశ్‌కు కొడుకు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వివరించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

**జగిత్యాలక్రైం:** పొలాస శివారులో జగిత్యాల–ధర్మపురి ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతిచెందారు. ముగ్గురి కి తీవ్ర గాయాలు అయ్యాయి. జగిత్యాల విజయపురికాలనీకి చెందిన దయ్యాల రమేశ్(33), బాలెపల్లి గ్రామానికి చెందిన ఏగుర్ల గణేశ్ కల్లెడ గ్రామంలో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. వేర్వేరు బైక్‌లపై తిరిగి ఇంటికి వస్తుండగా పొలాస శివారులో గుర్తు తెలియని వాహనం రెండు బైక్‌లను ఢీకొట్టింది. రమేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. గణేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ఆస్పత్రికి తరలించేందుకు సాయం చేస్తున్న ధర్మపురి మండలం నేరెల్లకు చెందిన అక్కినపల్లి బాబుకుమార్, మామిడిపల్లి సత్తయ్యను గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. బాబుకుమార్ కాలుతెగి రోడ్డుపై పడిపోయింది. సత్తయ్యకు తీవ్రగాయాలు అయ్యాయి. వీరిని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రూరల్ ఎస్సై సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని జగిత్యాల రూరల్ ఎస్సై ఈ సందర్భంగా వివరించారు.

## పాముకాటుతో బాలుడి మృతి


**మానకొండూర్:** మండల కేంద్రానికి చెందిన ఇస్కుల్లా నవీన్ కుమారుడు సుహాశ్(3) పాముకాటుతో మృతి చెందాడు. శుక్రవారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటూ ఉండగా పాముకాటు వేసింది, బాలుడి నోటి నుంచి నురగలు రావడం గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతిచెందాడని వైద్యులు తెలిపారు. ఒక్కగానొక్క కొడుకు పాముకాటుతో చనిపోవడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

## పొలంలో పడి వ్యక్తి మృతి

**వీణవంక:** హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ దుకిరే రాజు(32)అనే పొలంలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఓ ఆసామి వద్దకు నారు మోయడానికి వెళ్లగా ప్రమాదవశాత్తు బురదలో బోర్లపడటంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారని తెలిపారు.

# పెరుగుతున్న గుడ్డు ధర

- రిటైల్ మార్కెట్‌లో రూ.7 పలుకుతున్న ధర
- సామాన్యులకు దూరమవుతున్న గుడ్డు



**జ్యోతినగర్(రామగుండం):** బహిరంగ మార్కెట్‌లో కోడిగుడ్ల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. నిన్న, మొన్నటి దాకా చికెన్ ధరలు అమాంతం పెరిగి కొద్దిగా తగ్గుతున్న క్రమంలో గుడ్డు ధరలు పెరిగిపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. చలి తీవ్రతకు కోడిగుడ్ల ఉత్పత్తి తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. దీనికితోడు దాణా ధరలు విపరీతంగా పెరిగాయి. అంతోఇంతో ఉత్పత్తి అయిన గుడ్లలో ఎక్కువశాతం ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. దీంతో కోడిగుడ్డు ధర ఆకాశన్నంటింది. సామాన్యులు గుడ్డు కూరకు దూరమయ్యారు. గుడ్డు వినియోగం పెరగడం.. ఉత్పత్తి తగ్గడం కూడా ధరల పెరుగుదలకు కారణమైంది. కరోనా సమయంలో కోడిగుడ్ల వినియోగం పెరిగింది. ఇప్పుడు మళ్లీ కరోనా కేసులు పెరుగుతుండటంతో గుడ్లు తినేవారి సంఖ్య పెరుగుతోంది. గతంలో కిలో రూ.15 నుంచి రూ.17 వరకు ఉన్న కోళ్ల దాణా ధర ప్రస్తుతం రూ.28కి చేరింది. గుడ్డుకు రూ.5.25 ధర పలికితే తమకు గిట్టుబాటు అయ్యేదని, ప్రస్తుతం దాణా ధర పెరగడం, డిమాండ్‌కు తగ్గట్లు గుడ్ల ఉత్పత్తి లేకపోవడంతో గిట్టుబాటుకావడం లేదని పౌల్ట్రీ నిర్వాహకులు చెబుతున్నారు.

**ఏడుకు చేరిన గుడ్డు ధర**

గత సంవత్సరం నుంచి కోడిగుడ్ల ధర పెరుగుతూ ఉంది. ప్రస్తుతం అది రూ.7కు చేరింది. ఫౌల్ట్రీ ధర రూ.5.92 ఉండగా, హోల్‌సేల్ ధర రూ.6.30కి చేరింది.

### ధర పెరిగింది

కోడిగుడ్ల ధరలు పెరిగిపోయాయి. కూరగాయాలు ధరలు పెరుగుతున్న సమయంలోనే కోడిగుడ్ల ధరలు పెరుగుతున్నాయి. గుడ్లు కొనాలంటే భయమేస్తుంది. చికెన్ ధరలు పెరిగి కొంత తగ్గాయి. కానీ గుడ్ల ధరలు చాలా పెరిగిపోయాయి. ధరలు తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

–సంతోష, గృహిణి, ఎన్టీపీసీ

### ఎగుమతే కారణం

ఇరవై రోజులుగా గుడ్ల ధర పెరుగుతూనే ఉన్నాయి. రూ.5గా ఉన్న గుడ్డు ధర ప్రస్తుతం హోల్ సేల్‌గా రూ. 6.15కు చేరింది. తెలంగాణలోని గుడ్లు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. అక్కడ ఒకగుడ్డుపై రూ.0.65 ఎక్కువగా రావడంతో వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. దీంతో స్థానికంగా గుడ్ల కొరత ఏర్పడి ధరలు పెరుగుతున్నాయి. –గుండా చంద్రమౌళి, వ్యాపారి, ఎన్టీపీసీ